రంగుల కేళి..

హోలీ.. రంగుల కేళి. నగరంలో ఆదివారం పలుచోట్ల చిన్నా, పెద్ద, యువత అంతా ఇంద్రధనుస్సు వర్ణాలలో తడిసి ముద్దయ్యారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకొని డీజే ధ్వనుల నడుమ సంగీతానికి లయబద్ధంగా నృత్యాలు చేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. నగరంలో ప్రధానంగా కూకట్‌పల్లి వై జంక్షన్, హుస్సేన్ సాగర్ తీరాన నెక్లెస్ రోడ్డులో నగరవాసులు హోలీ కేళిని ఎంతో సంబురంగా జరుపుకున్నారు. మరి కొందరు మిఠాయిలు పంచుతూ, పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

పోటీ పరీక్షల శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మేడ్చల్ కలెక్టరేట్, మార్చి 24: పోటీ పరీక్షల ఉచిత శిక్షణకు ఎస్సీ నిరుద్యోగ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ జిల్లా అధికారి వినోద్ కుమార్ తెలిపారు. శిక్షణ తరగతులు ఈ నెల 26 నుంచి ప్రారంభం కానున్నాయని తెలిపారు. 85 బ్యాక్‌లాగ్ అడ్మిషన్ల భర్తీకి ఆసక్తి గల అభ్యర్థులు స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు కోరుతున్నట్టు తెలిపారు. ఈసీఐఎల్‌లో ఉన్న సాయి సుధీర్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 28వ తేదీన దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ నం: 96182 66091లో సంప్రదించాలని కోరారు.

రంగుల జీవితం.. కాకూడదు అంధకారం

- నేడే హోలీ.. కండ్లు జరభద్రం
- హోలీ నిర్వహణలో జాగ్రత్తలు తప్పనిసరి
- సహజ రంగులనే వినియోగించాలి: వైద్య నిపుణులు

సిటీబ్యూరో, మార్చి 24(నమస్తే తెలంగాణ): 'కొట్టు..కొట్టు..కొట్టు.. రంగుతీసి కొట్టు.. రంగులోనే లైఫ్ ఉందిరా' అంటూ నగరవాసులు హుషారుగా హోలీని జరుపుకోవడానికి సిద్ధమయ్యారు. ఇప్పటికే నగరంలో పలు సంస్థలు, హోటళ్లు, రిసార్ట్‌లు హోలీ వేడుకలకు ఏర్పాట్లు చేశాయి. రంగులు చల్లుకుంటూ సందడిగా గడిపేందుకు చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అందరూ రెడీ అయ్యారు. కోఠి, అబిడ్స్, సికింద్రాబాద్, అమీర్‌పేట్, దిల్‌సుక్‌నగర్ తదితర ప్రాంతాల్లో హోలీ సామగ్రి దుకాణాలు సందడి తలపిస్తున్నాయి. కాగా, రసాయనాలు కలిగిన రంగులను చల్లుకోకూడదని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. సహజ రంగులనే వినియోగించాలంటూ హితవు పలికారు. సింథటిక్, డార్క్ కలర్స్ వాడకపోవడం మంచిదని తెలిపారు. శరీరాన్ని ఎక్కువగా కప్పివుంచే దుస్తులు వేసుకోవడం ఉత్తమమని సూచించారు. సింథటిక్ రసాయన రంగులను ఎక్కువగా వినియోగిస్తున్నారని, అవి నేత్ర దృష్టి పరంగా తీవ్ర ప్రభావం చూపిస్తాయని చెప్పారు. నిర్లక్ష్యం చేస్తే ఎలర్జీలు, ఇన్‌ఫెక్షన్లు, కొన్ని సార్లు తాత్కాలిక అంధత్వం వస్తుందని తెలిపారు. కండ్ల చుట్టూ ఉన్న ఛర్మం చాలా సున్నితంగా ఉంటుందని, కొబ్బరి నూనె, బాదం నూనెతో ఛర్మానికి రాస్తే స్కిన్ పాడవకుండా ఉంటుందని చెబుతున్నారు. కండ్లకు స్పెట్స్ వినియోగించాలని సూచించారు. కండ్లల్లో రంగులు పడినప్పుడు వీలైనంత తొందరగా శుభ్రం చేసుకోవాలన్నారు. ఒక వేళ కండ్లు ఎర్రబడితే, దురదగా అనిపించినా, కండ్ల నుంచి నీరు వస్తున్నా, రక్తస్రావం అనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలన్నారు. హోలీలో వాడే నీటి బెలూన్స్‌కు దూరంగా ఉంటే మంచిదన్నారు. కాంటాక్ట్ లెన్స్‌లు వాడకూడదన్నారు.

కిమ్స్‌లో పీసీఓఎస్ మెటాబాలిక్ సిండ్రోమ్‌పై సదస్సు

కిమ్స్ ఆసుపత్రిలో సదస్సును ప్రారంభిస్తున్న వైద్యులు

బేగంపేట్ మార్చి 24: పీసీఓఎస్‌పై వైద్య రంగంలో ఉన్నవారికి అవగాహన అవసరమని యూనివర్సిటీ కాలేజ్, లండన్ హాస్పటల్స్‌కు చెందిన ప్రొఫెసర్ గెరార్డ్ కాన్వే, డాక్టర్ ఏఫియా యాసిమ్‌లు సూచించారు. 'మెటబాలిక్ సిండ్రోమ్ ఇన్ పీసీఓఎస్' అనే అంశంపై ఆదివారం సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో ఒక రోజు సదస్సు జరిగింది. పీసీఓఎస్ సొసైటీ ఇండియా, కిమ్స్ ఆసుపత్రి ఫెర్టిలిటీ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సుకు దేశం నలుమూలల నుంచి 400 మందికి పైగా వైద్యులు పాల్గొన్నారు. కిమ్స్ ఫెర్టిలిటీ విభాగాధిపతి డాక్టర్ ఎస్.వైజయంతి మాట్లాడుతూ, మన దేశంలో దాదాపు 20 శాతం మహిళలలో పీసీఓఎస్ సంబంధిత సమస్యలుంటాయని తెలిపారు. ఈ సమస్య ఉన్న వారికి గర్భం రావడం అనేది ఒక సవాలుగా మారిందన్నారు. ముగ్గురిలో ఒకరికి ఇలాంటి సమస్యలు కనిపిస్తున్నాయన్నారు. అందుకే పీసీఓఎస్‌లో ఉండే మెటబాలిక్ సిండ్రోమ్‌పై వైద్య నిపుణులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్స్ కాంతి బన్సల్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్

ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య

ముషీరాబాద్, మార్చి 24: రాష్ట్రంలోని పలు ప్రభుత్వ శాఖలలో పని చేస్తున్న 1.5 లక్షల మంది కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని, రెండు నెలలుగా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆందోళనలు చేస్తున్నా సీఎం రేవంత్‌రెడ్డి స్పందించకపోవడం శోచనీయమన్నారు. విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఆదివారం జరిగిన కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. తాత్కాలిక ఉద్యోగులకు రెగ్యులర్ ఉద్యోగులకు ఉండే అన్ని అర్హతలున్న విషయాన్ని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకొని, వివిధ శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. తాత్కాలిక ఉద్యోగులకు కావలసిన అర్హతలు ఉంటే పర్మినెంట్ చేయాలని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును అనుసరిస్తూ పర్మినెంట్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నేతలు గుజ్జ కృష్ణ, నీల వెంకటేశ్, నందగోపాల్, సుధాకర్, రమేష్, ఈ వెంకట్ పాల్గొన్నారు.

ప్రాచీన లలిత కళలు మన జాతి సంపద

అవార్డు గ్రహీతలను సత్కరిస్తున్న మామిడి హరికృష్ణ, రమణారావు

రవీంద్రభారతి, మార్చి 24: ప్రాచీన లలిత కళలు మన భారతీయ శాస్త్రీయ సంగీత, నృత్య జీవన సాంప్రదాయ కళలని, ఆ కళలను పరిరక్షించుకోవాలని తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాకులు డాక్టర్ మామిడి హరికృష్ణ, పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తలు అన్నారు. భారత్ ఆర్ట్స్ అకాడమీ, ఏబీసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రవీంద్రభారతిలోని మెయిన్ హాల్‌లో శివరాత్రి స్వర్ణ నంది పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. భారత్ ఆర్ట్స్ అకాడమీ, ఏబీసీ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ రమణారావు సభా అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి డాక్టర్ మామిడి హరికృష్ణ, కోలేటి దామోదర్ గుప్తలు విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం చేసి పలువురి నాట్య గురువులకు, సినీ కళాకారులకు శివరాత్రి స్వర్ణ నంది పురస్కారాలను ప్రదానం చేశారు. అనంతరం డాక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ అంతరించి పోతున్న లలిత కళలను నాట్య గురువులు, ప్రభుత్వాలు కాపాడాలన్నారు. భారతీయ జాతి సంపదలైన శాస్త్రీయ, సంగీత నృత్య కళలు మన పూర్వీకులు ప్రసాదించిన గొప్ప జీవన ధార అని ఆయన కొనియాడారు. భారత్ ఆర్ట్స్ అకాడమీ, ఏబీసి ఫౌండేషన్ చైర్మన్ లయన్ రమణారావు మాట్లాడుతూ, నాట్యకారిణులు లలిత కళలను చాలా అద్భుతంగా ప్రదర్శించి అబ్బుర పరిచారని తెలిపారు. ఈ సందర్భంగా లయన్ రమణారావు, లలితారావులను వారు అభినందించారు. సభకు ముందు ప్రముఖ బుల్లి తెర నటి జ్యోతిరెడ్డి, విష్ణుప్రియ, సిద్ధార్థ్‌లకు శివరాత్రి స్వర్ణ నంది అవార్డులతో ఘనంగా సత్కరించారు.

వీధి వ్యాపారులకు చేయూత..!

- జీహెచ్ఎంసీ సర్వేలో 1,65,638 మంది గుర్తింపు
- 1,65,301 మందికి గుర్తింపు కార్డుల జారీ
- వ్యాపారాభివృద్ధికి గాను రూ.130.76 కోట్ల సర్దుబాటు
- తాజాగా మూడో విడత పంపిణీకి శ్రీకారం
- వీధి వ్యాపారుల్లో జీవన ప్రమాణాలను పెంపొందించడమే లక్ష్యంగా చర్యలు

సిటీబ్యూరో, మార్చి 24(నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్‌లో వీధి వ్యాపారులకు ఆర్థిక చేయూతనందించి, వారిలో జీవన ప్రమాణాలను పెంపొందించడమే లక్ష్యంగా జీహెచ్ఎంసీ చర్యలు తీసుకుంటున్నది. తాజాగా వీధి వ్యాపారులకు మూడో విడతలో ఒక్కొక్కరికి రూ.50 వేలను పంపిణీకి శ్రీకారం చుట్టింది. రుణాల పంపిణీలో భాగంగా వీధుల్లో తిరుగుతూ చిరు వ్యాపారులకు ఆర్థిక చేయూతనందించే ఉద్దేశంతో హైదరాబాద్ మహా నగరంలో సర్వే చేయగా, 1,65,638 మందిని గుర్తించారు. అందులో భాగంగా 1,65,301 మందికి గుర్తింపు కార్డులను జారీ చేశారు. 30 వెండింగ్ కమిటీలను ఏర్పాటుతో పాటు 584 కామన్ ఇంట్రెస్ట్ గ్రూపులను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగానే మూడో విడతలో 5,808 మందికి గాను రూ.28.69 కోట్ల రుణాలను అందజేయగా, మొత్తం మూడు విడతల్లో 85,441 మందికి రూ.130.76 కోట్ల రుణాలను అందించారు. కాగా ఇప్పటి వరకు రూ.2.24 కోట్లను వీధి వ్యాపారులు క్యాష్ బ్యాక్ చేశారు.

వీధి వ్యాపారుల్లో మరింత చైతన్యం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే ఆమలు చేస్తున్న వీధి వ్యాపారుల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి పీఎం సురక్ష బీమా యోజన, జీవన జ్యోతి బీమా యోజన, శ్రమయోగి మందన్ ఫించన్ యోజన, మాతృవందన యోజన, జననీ సురక్షణ యోజన, జన్‌ధన్ యోజన, వన్ నేషన్ వన్ కార్డు, తదితర పథకాలను మరింత పకడ్బందీగా అందించేందుకు వీధి వ్యాపారుల పూర్తి వివరాలతో కూడిన సమాచారాన్ని పొందుపర్చేందుకు వెబ్ ఆధారిత ప్రత్యేక సమగ్ర యాప్‌ను రూపొందించింది. ఇందులో భాగంగానే వీధి వ్యాపారులను చైతన్యం చేసే వారికి ప్రభుత్వ పథకాలు వర్తింపజేసేందుకు 'మై బీ డిజిటల్' అనే కార్యక్రమం ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. అంతే కాకుండా డిజిటల్ పేమెంట్స్‌ను ప్రోత్సహిస్తున్నారు. వీటితో పాటు వీధి వ్యాపారులతో స్విగ్గీ, జుమోటోలు ఒప్పందం కుదుర్చుకుంటుండటం గమనార్హం.

స్ట్రీట్ వెండర్స్ వివరాలు

- వీధి వ్యాపారులను గుర్తించినవి 1,65,638
- ఐడీ కార్డులు జారీ చేసినవి 1,65,301
- టౌన్ వెడింగ్ కమిటీల ఏర్పాటు 584గ్రూపులు

రుణాల పంపిణీ

టర్మ్	దరఖాస్తులు	అర్హత పొందిన వి/రుణాల మంజూరు(రూ.కోట్లలో)	రుణాల పంపిణీ (రూ.కోట్లలో)
మొదటి విడత	81,979	57,348/రూ.57.31	56,802/రూ.56.49
రెండో విడత	38,179	23,091/రూ.46.11	22,831/రూ.45.58
మూడో విడత	6,814	5898/రూ.29.18	5808/రూ.28.69
	1,26,972	86,337/రూ.132.60	85,441/రూ.130.76కోట్లు

పీవీకి భారత రత్న తెలంగాణకు గర్వకారణం

కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలచారి

ఎమ్మెల్సీ సురభి వాణీదేవిని సత్కరించిన బ్రాహ్మణ సంఘం నాయకులు

ఎల్బీనగర్, మార్చి 24: తొలి తెలుగు ప్రధాని, బహు భాషా కోవిదుడు, ఆర్థిక సంస్కరణల ఆధ్యుడు, దివంగత పీవీ నర్సింహారావుకు భారత రత్న ప్రకటించడం తెలంగాణకు గర్వకారణమని కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలాచారి అన్నారు. కొత్తపేటలో ఆదివారం తెలంగాణ బ్రాహ్మణ సంఘాల సమాఖ్య అధ్యక్షుడు వెన్నంపల్లి జగన్మోహన శర్మ, గ్రేటర్ అధ్యక్షుడు మునిపల్లె శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన బ్రాహ్మణ సంఘాల ఆత్మీయ సమ్మేళనం, మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుగోపాలచారి మాట్లాడుతూ, దివంగత పీవీ నర్సింహారావు దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. పీవీ కుటుంబం నుంచి వచ్చిన ఎమ్మెల్సీ వాణీదేవి రాజకీయాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. బ్రాహ్మణులంతా ఐకమత్యంతో ముందడుగు వేయాలన్నారు. ఎమ్మెల్సీ సురభి వాణీదేవి మాట్లాడుతూ పీవీ నర్సింహారావు స్ఫూర్తితో అందరు ముందుకుసాగాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు, బసవరాజు శ్రీనివాస్, వైష్ణవి ప్రసాద్, బోరుపట్ల హన్మంతచారి, నాగేశ్వర సిద్ధాంతి, రఘునందన్, రాజు, వక్కలంక శ్రీనివాసరావు, శశి, పార్థసారథి, ఈశ్వర్, భాస్కర మూర్తి పాల్గొన్నారు. తెలంగాణ బ్రాహ్మణ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ సురభి వాణీదేవికి ఘనంగా సన్మానం చేశారు. ప్రముఖ వైద్యులు సూరి, అనంతలక్ష్మి, మాందాత, నిస్సాని, రుక్మిణిలను ఈ సందర్భంగా సత్కరించారు.

కబడ్డీలో రన్నరప్‌గా నాంపల్లి కోర్టు జట్టు

నాంపల్లి కోర్టులు, మార్చి 24(నమస్తే తెలంగాణ): న్యాయవాదుల పరస్పర సహాయక సహకార సంఘం రజతోత్సవాల్లో భాగంగా క్రీడా పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా కబడ్డీలో నాంపల్లి కోర్టు జట్టు రన్నరప్‌గా నిలిచింది. జంట నగరాల్లోన్ని అన్ని కోర్టులకు చెందిన మహిళా న్యాయవాదులు కూడా ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగారెడ్డి, నాంపల్లి కోర్టులకు చెందిన జట్ల మధ్య జరిగిన హోరాహోరీ పోరులో నాంపల్లి కోర్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. జట్టు కెప్టెన్ వెంకటరమణ గౌడ్ ఉత్తమ ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. 100 మీటర్ల పరుగు పందెంలో నాంపల్లి నుంచి తిరుపతి వర్మ ప్రథమ స్థానంలో నిలిచి కప్‌ను గెలిచాడు. విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని సహకార సంఘం అధ్యక్షులు ఆలుగడ్డల అనిల్ కుమార్, కార్యదర్శి పొలిశెట్టి రవి, డైరెక్టర్లు మహేశ్ కుమార్, చింతల క్రిష్ణ, సభ్యులు కొండూరు వినోద్ కుమార్, న్యాయవాదులు విజయవంతం చేసేందుకు సహకరించారు.

టెట్ పరీక్షా ఫీజును తగ్గించాలని సీఎంకు లేఖ

సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాస్తున్న స్వామి గౌడ్

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 24: టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ ఫీజును తక్షణమే తగ్గించాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు బొల్లేపల్లి స్వామి గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. అనంతరం, ఆయన మాట్లాడుతూ టెట్ పరీక్షా ఫీజులను ఒక్కో పేపర్‌కు రూ.200 నుంచి రూ.1000కి పెంచు తూ రాష్ట్ర విద్యాశాఖ జారీ చేసిన నోటిఫికేషన్‌లో పేర్కొనడాన్ని తప్పుబట్టారు. అధిక ఫీజులు లేకుండా పోటీ పరీక్షలు నిర్వహిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నదని ఆయన గుర్తు చేశారు. టెట్‌ను, దాని నిర్వహణను పక్కనబెట్టి, కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజులను ఐదింతలు పెంచిందని మండిపడ్డారు. దీంతో లక్షలాది మంది విద్యార్థులు, నిరుద్యోగులపై ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే టెట్ పరీక్షా ఫీజులను తగ్గించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సివిల్స్ అభ్యర్థులు సమైక్య భావాలు పెంపొందించుకోవాలి

యూపీఎస్సీ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ డీపీ అగర్వాల్

డీపీ అగర్వాల్‌కు సన్మానం చేస్తున్న అకాడమీ డైరెక్టర్ కృష్ణప్రదీప్

చిక్కడపల్లి, మార్చి 24: యూపీఎస్సీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు నిజాయితీ, చిత్తశుద్ధితో సమైక్య భావాలు పెంపొందించుకోవాలని యూపీఎస్సీ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ డీపీ అగర్వాల్ సూచించారు. అదే విధంగా ఏమాత్రం ఒత్తిడి లేకుండా నేర్చుకోవడాన్ని ఆస్వాదించాలని అభ్యర్థులకు తెలిపారు. అశోక్‌నగర్‌లోని కృష్ణ ప్రదీప్ 21వ సెంచరీ ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో సివిల్స్ అభ్యర్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ డీపీ అగర్వాల్ మాట్లాడారు. శిక్షణలో చెప్పే అంశాలను శ్రద్ధగా విని ఆస్వాదిస్తూ నేర్చుకోవాలన్నారు. యూనివర్సిటీ పరీక్షలకు, పోటీ పరీక్షలకు కొంత తేడా ఉంటుందన్నారు. యూనివర్సిటీ పరీక్షలలో అయితే, కేవలం ఆ సబ్జెక్టులో పరిజ్ఞానాన్ని మాత్రమే చూస్తారని, అదే పోటీ పరీక్షల్లో వ్యక్తిత్వం మొత్తాన్ని అంచనా వేస్తారన్నారు. కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ కృష్ణ ప్రదీప్, డాక్టర్ భవానీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ సాధికారతపై ట్విన్ సిటీ 10కే రన్

మహిళ సాధికారతపై నెక్లెస్ రోడ్‌లోని ట్విన్ సిటీ 10కే రన్ - 2024 పేరుతో పరుగులు నిర్వహించారు. ఆదివారం ఉదయం సంజీవయ్య పార్కు నుంచి పీపుల్స్ ప్లాజా వరకు కొనసాగిన 10కే, 5కే పరుగును హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టీ రజనీ జెండా ఊపి ప్రారంభించారు. గ్లోబల్ ఈవెంట్స్ ఎంటర్టైన్‌మెంట్ వాక్‌ఫిట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సెకండ్ ఎడిషన్ రన్‌లో యువతతో పాటు రన్నర్స్ పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వంటశాలకే మహిళలు పరిమితం కాకుండా, అన్ని రంగాల్లో రాణించాలని ఫిట్‌నెస్‌పై కూడా దృష్టి సారించాలని జస్టిస్ రజనీ కోరారు. ప్రతి ఒక్కరు తప్పనిసరిగా వ్యాయామం చేయాలని సూచించారు. *- బేగంపేట్ మార్చి 24*

ఎల్లమ్మ సన్నిధిలో ఫ్యామిలీ స్టార్ యూనిట్

షూటింగ్ పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధమైన 'ఫ్యామిలీ స్టార్' సినీ యూనిట్ సభ్యులు ఆదివారం బల్కంపేట ఎల్లమ్మ దేవాలయంలో పూజలు నిర్వహించారు. ఈ సినిమా హీరో విజయ్ దేవరకొండ సరసన హీరోయిన్‌గా నటించిన మృణాల్ ఠాకూర్, నిర్మాత దిల్ రాజు, దర్శకులు పరశురామ్, సినీ ప్రముఖులు జి.భాస్కర్‌రావు (జీబీఆర్)తో పాటు యూనిట్ సభ్యులు ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ పాలక మండలి పూర్వ సభ్యులు సింగారపు శ్రీనివాస్ గుప్తా, బూర్గుల ఉమానాథ్ గౌడ్‌లతో పాటు బీఆర్ఎస్ నాయకులు వనం శ్రీనివాస్‌లు పాల్గొన్నారు. *- అమీర్‌పేట్, మార్చి 24*